ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

చుంచుపల్లి, నవంబర్ 7: కొత్తగూడెం సహకార సంఘానికి చెందిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండలంలోని పెనగడప గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇస్తోందని అన్నారు. దీనిని పొందాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అన్నారు. జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్, సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డీఎంవో త్రినాథ్‌బాబు, ఏడీఏ నర్సింహారావు, తహసీల్దార్ కృష్ణ, డీటీ ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేల పరామర్శ

అశ్వారావుపేట టౌన్, నవంబర్ 7: స్థానిక గౌడ బజార్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త, గీత కార్మికుడు ఆరేపల్లి బాబూరావు ఇటీవల మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరావు,తాటి వెంకటేశ్వర్లు గురువారం పరామర్శించారు. బాబూరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నేతలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బాధ్యుల నియామకం

మణుగూరు టౌన్, నవంబర్ 7: బీఆర్ఎస్ మండల కన్వీనర్లు, కోకన్వీనర్లుగా కుర్రా నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, బొల్లిశెట్టి నవీన్, నూకారపు రమేష్ నియమితులయ్యారు. వీరిని మండల పార్టీ కార్యాయలంలో నాయకులు గురువారం సన్మానించారు.

కేజీబీవీలో బోధనేతర సిబ్బందికి ఆహ్వానం

టేకులపల్లి, నవంబర్ 7: స్థానిక కేజీబీవీలో బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో జగన్ గురువారం తెలిపారు. డే వాచ్ ఉమన్, అటెండర్ పోస్టులకు మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిసున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఆళ్ళపల్లి, నవంబర్ 7: స్థానిక కేజీబీవీలో కుక్ నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ సరోజన, ఎంఈవో శాంతారావు గురువారం తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 45 మధ్య వయసున్న ఆళ్లపల్లి మండలానికి చెందిన మహిళలు ఈ నెల 10వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

అమరవీరుల సంస్మరణ సభ

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 7: మండలంలోని దురదపాడు గ్రామంలో గురువారం సీపీఐ-ఎంఎల్(మాస్‌లైన్) అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, నాయకులు పండా ముత్యాలు, అర్జున్, బాడిస దుర్గారావు పాల్గొన్నారు.

రామచంద్ర కాలేజీలో కానిస్టేబుల్ వీరంగం

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 7: మండల కేంద్రంలోని రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈవీఎం స్ట్రాంగ్ రూం వద్ద ఉండే కానిస్టేబుల్ వీరంగం సృష్టించాడు. మద్యం మత్తులో ఉన్న సదరు కానిస్టేబుల్.. ఆ పక్కనే ఉన్న సాంఘిక సంక్షేమ వసతిగృహంలోకి వెళ్లి అక్కడి వార్డెన్‌ను, విద్యార్థులను దూషించాడు. హాస్టల్ వార్డెన్‌ను చితకబాదాడు. డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఇలా చేయడంపై విద్యార్థులంతా కలిసి ఆందోళన చేయడానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి అక్కడికి చేరుకొని ఆ విద్యార్థులను శాంతింపజేశారు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అతడిపై యాక్షన్ తీసుకునేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. దీంతో విదార్థులు శాంతించారు. సదరు కానిస్టేబుల్‌పై బాధితులు ఫిర్యాదు చేశారు.

అనాథాశ్రమానికి సరుకులు అందజేత

దమ్మపేట, నవంబర్ 7: మండలంలోని మల్లారం గ్రామంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రత్యేక శిబిరం కొనసాగుతున్నది. స్థానిక అమ్మ సేవాసదన్ వృద్ధాశ్రమాన్ని విద్యార్థులు గురువారం సందర్శించారు. నిత్యావసర సరుకులతోపాటు పండ్లు, మిఠాయిలు అందజేశారు. ఎస్ఎస్ఎస్ అధికారులు ఎం.రాంప్రసాద్, పి.రెడ్డిప్రియ, టి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చుంచుపల్లి, నవంబర్ 7: మండలంలోని గౌతంపూర్ కాలనీ పంచాయతీకి చెందిన ఆరెల్లి సతీశ్ (36) అనారోగ్యంతో బాధపడుతూ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సతీశ్.. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గౌతంపూర్‌లోని ఈ2 (32) క్వార్టర్‌లోని తన నివాసంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరెతో ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు ఇంటికొచ్చి చూసే సరికి తలుపులు వేసి ఉన్నాయి. కిటికీలోంచి చూడగా అతడు ఉరికి వేలాడుతున్న కన్పించాడు. వెంటనే వారు తలుపులు పగులగొట్టారు. అప్పటికే మృతిచెందిన సతీశ్‌ను చూసి బోరున విలపించారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, పాల్వంచ బ్రాంచ్ వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూసిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని శ్రీమతి అజ్మీర ప్రేమీల, W/O. అజ్మీర బాబు నాయక్, వయస్సు : 38 సం॥లు, వృత్తి : గృహిణి, నివాసం : ఇ.నెం. 22-1-4/6, అయ్యప్పనగర్, పాల్వంచ పట్టణం, పాల్వంచ మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తగాదాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 7 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిస్ట్రారు ఖమ్మం, సబ్ రిజిస్ట్రారు వారి ఇలాఖా కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, పాల్వంచ మున్సిపల్ పరిధిలో చేరిన, పాల్వంచ గ్రామము యందు నేను మీకు విక్రయించిన సర్వే నెం. 745 మింజూమరి భాళీ నివేశన స్థల ప్లాటునకు కొలతలు పాడవు 60'.0'' అడుగుల వెడల్పు 35'.0'' అడుగులు మొత్తం విస్తీర్ణం. 233.33 చదరపు గజములు / 195.00 చదరపు మీటర్లు, దాఖ్యమెంట్ నెం. : 5485/2019 గల ఆస్తికి హద్దులు : తూర్పు : 20'.0'' అడుగుల వెడల్పు గల రోడ్డు, పడమర : యస్.సీతారామరాజు గారి ఇల్లు, ఇ.నెం. 22-1-4/6, ఉత్తరం : 20'.0'' అడుగుల వెడల్పు గల రోడ్డు, దక్షిణము : యర్రం వెంకటేశ్వరరావు గారి ఇల్లు.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

'గిరిజన సంక్షేమ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి'

పాల్వంచ, నవంబర్ 7: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని సమస్యలను, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు, ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యుడు రామాచారి డిమాండ్ చేశారు. పాల్వంచ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా కార్యదర్శి ఉమాదేవి అధ్యక్షతన గురువారం జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా కన్వర్ట్ చేయాలని, నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాలకు కొత్త పోస్టులు, అదనపు సెక్షన్లకు అదనపు పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

మైరాడా ప్రాజెక్ట్

టెండర్ నెం. My BCM 1/2024-25 భద్రాద్రి కొత్తగూడెం, తేది.07-11-2024

మైరాడా ప్రాజెక్ట్ భద్రాచలం ప్రకటించిన టెండర్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామముల పరిధిలో మేము చేయుచున్న SMCP ప్రోగ్రాం నందు గల వర్క్స్‌వర్క్ (మట్టి కట్టలు, చెరువు పూడిక తీతల, ఫారం ఫాండ్స్, చెరువుల మరమ్మత్తులు కొత్తవి నిర్మాణం వగైరా) పనులు మిషనరీతో మరియు స్టోన్ వర్క్ చేయుటకు అనుభవం, మిషనరీ గల కాంట్రాక్టర్‌ల నుండి సీల్డ్ టెండర్ కోరడమైనది. ఇతర వివరాలకు మైరాడా భద్రాచలం ప్రాజెక్ట్ ఆఫీస్ భద్రాచలం నందు సంప్రదించగలరు.

సెల్ నెం : 9493979105
టెండర్ ప్రారంభ తేది : 08-11-2024
టెండర్ ముగింపు తేది : 12-11-2024 మం॥ 12.30 గం॥లకు
సీల్డ్ టెండర్లు తెరుచు తేది : 14-11-2024 ఉ॥ 11.30 గం॥లకు

గమనిక : షరతులు వర్తిస్తాయి మరియు సీల్డ్ రిజిష్టర్ పోస్టు ద్వారా మాత్రమే స్వీకరించబడతాయి.

మైరాడా భద్రాచలం ప్రాజెక్ట్
ధరణి సూపర్ మార్కెట్ ఎదురు, చర్ల రోడ్, భద్రాచలం - 507111
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

సం/- ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్
బి.అజయ్

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 7: గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి (జనరల్) డేవిడ్ రాజ్ అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో గిరిజనుల పంట పొలాలను విద్యుత్, అటవీ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. గిరిజన రైతుల సమస్యలను తెలుసుకున్నారు. త్రీ ఫేజ్ విద్యుత్ సరిగ్గా లేక పోవడంతో సాగు కష్టంగా ఉందని గిరిజన రైతులు చెప్పారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను డేవిడ్ రాజ్ ఆదేశించారు.

రైతులతో మాట్లాడుతున్న డేవిడ్ రాజ్

ఆయన మాట్లాడుతూ.. పోడు భూములను గిరిజనులు మాత్రమే సాగు చేసుకోవాలన్నారు. సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలన్నారు. ఆయిల్ పాం, మునగ, పండ్ల తోటలను పెంచుకోవాలన్నారు. చేపల చెరువులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అటవీ ఫలాలు, ఇప్ప పువ్వులను ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేసి గిరిజనులకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తామన్నారు. సాగుకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీటీఆర్‌ఓఎఫ్ లక్ష్మీనారాయణ, ఎఫ్ఆర్‌వో మల్లయ్య, విద్యుత్ శాఖ ఏడీ రవి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 7: అన్నపురెడ్డిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరిగే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఫెయిర్)ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. సైన్స్ ఫెయిర్ కరపత్రాలను స్థానిక గురుకులంలో గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థుల్లో సైన్స్‌పట్ల ఆసక్తిని పెంచేందుకు సైన్స్ ఫెయిర్ ఉపయోగపడుతుందన్నారు. సైన్స్ ఫెయిర్ ప్రారంభ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరవుతారని చెప్పారు. డీఈవో వెంకటేశ్వరచారి, డీఎస్‌వో చలపతిరాజు, తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని కార్మికుల ధర్నా

దుమ్ముగూడెం, నవంబర్ 7: దుమ్ముగూడెంలో ఎస్ఎల్ఎస్ మినీ హైడల్ పవర్ ప్రాజెక్టు కార్మికులు తమ వేతనాలు పెంచాలన్న డిమాండుతో ప్రాజెక్టు గేటు వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొలగాని రమేష్ మాట్లాడుతూ.. పవర్ ప్లాంట్ కార్మికుల వేతనాలను పెంచాలని ఇప్పటికే పలుమార్లు యాజమాన్యానికి వినతిపత్రాలు అందించామన్నారు. వారు స్పందించకపోవడంతో ప్రత్యక్ష పోరాటంలోకి దిగినట్లు చెప్పారు. యాజమాన్యం స్పందించకపోతే 15వ తేదీ తర్వాత నిరవధిక సమ్మె చేస్తామన్నారు. సమ్మె నోటీసును యాజమాన్యానికి అందజేసినట్లు తెలిపారు. కార్మికులకు రైతు సంఘం మండల అధ్యక్షుడు యలమంచి శ్రీనివాస్ మద్దతు పలికారు. ఎస్ఎల్ఎస్ పవర్ ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కెఎస్.ప్రకాష్, కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు నగేష్, నరేంద్ర, రాజు, సతీష్, చిరంజీవి పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి వంతెన నిర్మాణం

ములకలపల్లి, నవంబర్ 7: మండలంలోని తాళ్లపాయ-ముత్యాలంపాడు వంతెన నిర్మాణ పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని శాసనసభ్యుడు జారె ఆదినారాయణ చెప్పారు. ఆయన గురువారం ములకలపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ... ములకలపల్లి లో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు. మండలవ్యాప్తంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

కుక్కల దాడిలో బాలికకు తీవ్ర గాయాలు

మణుగూరు టౌన్, నవంబర్ 7: మణుగూరులోని సమితి సింగారం పంచాయతీలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. సీతానగర్‌కు చెందిన గడప విక్కి, ప్రియ దంపతుల కుమార్తె జున్ను గురువారం కుక్కల దాడిలో తీవ్ర గాయాలపాలైంది. చిన్నారిని వెంటనే స్థానిక ఆస్పత్రికి కుటుంబీకులు తరలించారు. కుక్కల బెడదను తప్పించాలని అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఫిర్యాదు

ఇల్లెందు, నవంబర్ 7: అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్న వైన్స్ షాప్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సేవాలాల్ సేన నాయకలు గురువారం ఇల్లెందు ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇచ్చారు. మాలోత్ శివ నాయక్, ధరావత్ కృష్ణనాయక్, నరేష్, అంజి, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు

పాల్వంచ, నవంబర్ 7: పాల్వంచ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సుజాతను జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందించి సత్కరించారు. అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ యుగంధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

7సింగరేణి2: జీఎం సెక్యూరిటీ చందా లక్ష్మీనారాయణ

సింగరేణి జీఎం సెక్యూరిటీగా లక్ష్మీనారాయణ

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 7: సింగరేణి జీఎం సెక్యూరిటీగా చందా లక్ష్మీనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. హెచ్ఆర్‌డీ విభాగంలో ఏజీఎం పర్సనల్‌గా ఉన్న ఆయనకు ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు.

సంత టెండర్లలో అవకతవకల ఫిర్యాదుపై విచారణ

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 7: మున్సిపాలిటీలో వారాంతపు సంత టెండర్లలో అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదులపై అధికారులు గురువారం విచారణ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా టెండర్ ప్రక్రియ నిర్వహించారంటూ బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ ఇటీవల సీడీఎంఏకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసేందుకు సీడీఎంఏ ఆదేశాల మేరకు రీజినల్ డైరెక్టరేట్ ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ గురువారం కొత్తగూడెం చేరుకున్నారు. ఇక్కడి మున్సిపల్ కార్యాలయంలో సంత టెండర్ల విషయాలపై విచారణ జరిపారు. టెండర్‌కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఫిర్యాదుదారుడు ఎర్రా కామేశ్ ఫిర్యాదును సైతం రికార్డు చేశారు. ఈ అంశంపై విచారణాధికారి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. టెండర్ ప్రక్రియ సంబంధిత అంశంపై విచారణ చేసి నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

మునగ సాగుతో ఎన్నెన్నో ప్రయోజనాలు

మణుగూరు టౌన్, నవంబర్ 7: మునగ సాగుతో ఎన్నెన్నో ప్రయోజనాలు ఉన్నాయని డీఆర్‌డీవో విద్యాచందన అన్నారు. మణుగూరు రైతు వేదికలో గురువారం రైతుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మునగ సాగుతో ఆరోగ్యం+ఆదాయం రెండూ సంపాదించవచ్చని అన్నారు. ములక్కాయల విక్రయం ద్వారా లబ్ధి పొందవచ్చని, మునగ ఆకులతో ఆయుర్వేద మార్గం ద్వారా ఆరోగ్యం పొందవచ్చని అన్నారు. మునగ విత్తనాల నుంచి వచ్చే ఆయిల్‌ను లీటర్ రూ.600కు అమ్మవచ్చని అన్నారు. మునగ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నదని అన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏడీఏ తాతారావు, ఏఈవో లక్ష్మణరావు, ఏపీఎంవో అహ్మదుల్లా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్‌డీవో విద్యాచందన

పినపాక, నవంబర్ 7: మునగ సాగుతో రైతులకు ఎన్నెన్నో ప్రయోజనాలు ఉన్నాయని డీఆర్‌డీవో విద్యాచందన అన్నారు. ఆమె గురువారం పినపాక రైతు వేదికలో రైతుల సమావేశమయ్యారు. మునగ సాగు చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని అన్నారు. మునగ సాగుపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాటు సారా పట్టివేత

టేకులపల్లి, నవంబర్ 7: మండలంలోని తొమ్మిదోమైలు తండా గ్రామానికి చెందిన నునావత్ జగదీష్ ఇంటిలో ఎస్సై పోగుల సురేష్ గురువారం తనిఖీ నిర్వహించారు. నాలుగు లీటర్ల నాటు సారా స్వాధీనపర్చుకున్నారు. జగదీష్‌పై కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మేకలకు పోస్టుమార్టం

టేకులపల్లి, నవంబర్ 7: మండలంలోని లచ్చగూడెం గ్రామస్తుడు జబ్బ వెంకటేశ్వర్లు చెందిన 16 మేకలు ఇటీవల కేవోసీ సమీపాన మేతకు వెళ్ళి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి మృతిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో పశు వైద్యులు గురువారం పోస్టుమార్టం నిర్వహించారు.

రేపటి నుంచి ప్రత్యేక ఓటరు నమోదు

చండ్రుగొండ, నవంబర్ 7: ఈ నెల 9, 10 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఓటరు నమోదుకు పోలింగ్ బూత్‌లల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారరని చెప్పారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏండ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కుటుంబ సమగ్ర సర్వే పరిశీలన

దుమ్ముగూడెం, నవంబర్ 7: మండలంలోని నడికుడి పంచాయతీలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను డీఎల్‌పీవో, ప్రత్యేకాధికారి సుధీర్‌కుమార్ గురువారం పర్యవేక్షించారు. ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్, ఎస్‌జీటీలు నాగమణి, మోహన్ పాల్గొన్నారు.

సింగరేణి విద్యాసంస్థలను సీవోఈగా తీర్చిదిద్దాలి: సీఎండీ

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 7: సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)గా తీర్చిదిద్దాలని ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్‌ను సీఎండీ బలరాం ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో సీఎండీ మాట్లాడారు. సింగరేణి పాఠశాలల్లో ఒలింపియాడ్స్ ప్రవేశపెట్టాలని సూచించారు. అలాగే, సింగరేణి మహిళా కళాశాల, పాలిటెక్నిక్ కాలేజీల్లో ఎన్‌పీటీఈఎల్ చాప్టర్లు స్థాపించాలన్నారు. నూతన కోర్సులనూ ప్రవేశపెట్టాలని సూచించారు. విద్యార్థులకు ఎడ్యుకేషనల్ పర్యటనలు నిర్వహించాలని, వసతి గృహాల్లో సౌకర్యాలు పెంచాలని ఆదేశించారు. జూనియర్ కాలేజీల్లో ఇంటిగ్రేటెడ్ జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల బోధన చేపట్టాలన్నారు. సెక్టార్ 3 జీడీకే పాఠశాలల్లో కూడా సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని సూచించారు. అలాగే, బోధనా సిబ్బందిలో నైపుణ్యాల పెంపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కేయూ లాన్ టెన్నిస్ జట్టుకు పాల్వంచ విద్యార్థి

పాల్వంచ రూరల్, నవంబర్ 7: మండలంలోని లక్ష్మీదేవిపల్లి (ఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం ఫస్టియర్ విద్యార్థి బాష్యబోయిన మనోజ్‌కుమార్ కాకతీయ యూనివర్సిటీ (కేయూ) లాన్ టెన్నిస్ జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ లాన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మూడోస్థానాన్ని పొందడంతో యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జే.మాధవి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు విద్యార్థి మనోజ్‌ను అభినందించారు. ఈ నెల చివరి వారంలో కేరళలో జరుగనున్న సౌత్, వెస్ట్ జోన్ లాన్ టెన్నిస్ టోర్నమెంటులో రాణించాలని వారు ఆకాంక్షించారు. కళాశాల అధ్యాపకులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టీ.అరుణకుమారి, విజయ్‌ప్రసాద్, రమేశ్, వేముల కామేశ్వరరావు, పారెల్లి శ్రీనివాస్, కోటగిరి రాంబాబు తదితరులు కూడా మనోజ్‌ను ప్రశంసించారు.

హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

అశ్వారావుపేట టౌన్, నవంబర్ 7: ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ విమర్శించారు. అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ సమావేశం స్థానిక కార్యాలయంలో గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. మినీ అంగన్‌వాడీ సెంటర్లలను అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం, అక్కడి టీచర్స్‌కు మాత్రం జీతాలు పెంచలేదని విమర్శించారు. అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్, హెల్పర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాధ, నాగమణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలి

డిజిటల్ లైబ్రరీ ప్రారంభంలో భద్రాద్రి జిల్లా జడ్జి వసంత్ పాటిల్

డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి

కొత్తగూడెం టౌన్, నవంబర్ 7: జిల్లా న్యాయవాదుల సంఘం లైబ్రరీ హాల్లో ఏర్పాటుచేసిన డిజిటల్ లైబ్రరీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలి డిజిటల్ లైబ్రరీని కొత్తగూడెం బార్ అసోసియేషన్‌లో ప్రారంభించడం చాలా శుభపరిణామమని అన్నారు. న్యాయవాదులు ఈ డిజిటల్ లైబ్రరీని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. తద్వారా తమ వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని అన్నారు. న్యాయమూర్తులు గొల్లపూడి భానుమతి, సుచరిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని త్యనారాయణ, ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరరావు, ఎండీ సాధిక్‌పాషా, సందుపట్ల ప్రవీణ్ కుమార్, దూదిపాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ట్రిప్పు మామూలు పెంపు

ఇల్లెందు, నవంబర్ 7: ఇల్లెందు నుంచి వివిధ ప్రాంతాలకు ధాన్యం (వడ్లు) రవాణా చేస్తున్న లైన్ బండి లారీ డ్రైవర్లకు ట్రిప్పు మామూలు పెరిగాయి. ఈ మేరకు, గురువారం ఇల్లెందు డి బ్లాక్‌లో తెలంగాణ ప్రగతిశీల ఆటో, మోటర్ వర్కర్స్ ఫెడరేషన్ (ఇఫ్టూ) ప్రతి నిధులకు, లారీ అసోసియేషన్ యజమానుల మధ్య జరిగిన చర్చల్లో ఒప్పందం కుదిరింది. ట్రిప్పు మామూలు రూ.700 నుంచి రూ.800కు పెరిగింది.